
# ద్వేషం




వరండాలోని ఆడాళ్ళ మాటలు లోపలి గదిలోకి వినబడుతున్నాయ్.

"మా అత్తగారేం చేసిందో చూశారా? తన చిన్నకొడుక్కి ఇల్లు రాసిచ్చేసింది." పక్కింటావిడ కాబోలు అంటోంది.

"అదంతేలెండి! కొత్తొక వింత



కథా నిలయం
శ్రీకాకుళం

— యర్రంశెట్టి శాయి

పాతాక రోత అని, చిన్నకోడలే సర్వస్వం వాళ్ళకెప్పటికీనూ." తన భార్య గొంతు.

వామనరావుకి నవ్వొచ్చింది. కోడళ్ళంతా ఓ పార్టీ! అత్తలంతా ఓ పార్టీ! ఎన్నితరాలు గడచినా వీళ్ళ మన స్తత్వాల్లో మార్పురాదా? ఎప్పటికీ వీరు ఒకరినొకరు ద్వేషిస్తూనే ఉంటారా?

డ్రస్ చేసుకొని బయటికొచ్చా

డతను.

ఎదురుగ్గా పాకల్లో ఇద్దరు స్త్రీలు పోట్లాడుకుంటున్నారు. ఒకరినొకరు తిట్టుకుంటున్నారు. వారి పిల్లలనూ, భర్తలనూ, బంధుమిత్రులనూ దుమ్మెత్తి పోస్తున్నారు.

వామనరావుకి ఆశ్చర్యం కలిగింది.

వారిద్దరూ ఆ రోడ్డు పక్కనే కూర్చుని రోజూ గంటల తరబడి కబుర్లు చెప్పుకుంటూండేవాళ్ళు. ఇంతలో ఏమొచ్చిందో ఏమో? ఇంత విరోధులయి పోయారు. ఇలా పోట్లాడుకోవాలంటే వాళ్ళకు బాధగా ఉండదూ? అంతకు ముందు రోజు వరకూ ఉన్న అభిమానం, స్నేహం, ఆప్యాయతా అన్నీ ఒక్కసారిగా ఎలా త్రుంచేయ గలుగుతారు?

ఆఫీసుకి చేరుకొన్నాడతను.

వాణీ కూర్చునే సీటు ఖాళీగా ఉంది. వెంటనే రాంబాబు సీటు వేపు చూశాడతను.

అతను తలవంచుకుని ఫైల్సు చూసుకొంటున్నాడు.

ఇది మరీ ఆశ్చర్యం కలిగించింది వామనరావుకి.

వాణీ ఆఫీసుకి రాకపోతే, రాంబాబు కూడా ఆఫీసుకి రాడు. రాంబాబు రాకపోతే వాణీ కూడా రాదన్నమాటే! అంత చక్కని ప్రేమ ఇద్దరిదీ! ఆరు నెలల క్రితమే మొదలయింది వారి ప్రణయం. ఆఫీసు పని గురించి ప్రారంభమయిన పరిచయం-కలిసి రేడియో నాటకా లేయడం వరకూ పాకి, ఆ తరువాత సినిమా హాళ్ళల్లో రూపు మార్చుకొని, పార్కులో ప్రేమగా తేలింది. ఆ రోజు నుంచీ ఇంటి దగ్గర తప్పితే మిగతా అన్ని చోట్లా ఒంటరిగా ఆ ఇద్దరిలో ఎవరూ కనిపించేవారు కాదు- ఎప్పుడూ జంటగానే! ఉన్నట్లుండి హఠాత్తుగా ఇద్దరూ ఓ రోజు దంపతులయి ఆఫీసు కొచ్చారు. అందరికీ టీపార్టీ ఇచ్చారు ఆ సందర్భంలో. మరి ఇవాళ అతనొక్కడే రావడం, అదీ ఎవరితో మాట్లాడకుండా, రోజులా నవ్వుతూ తిరిగి హడావుడి చేయ

కుండా, ఒకరితో తనకు సంబంధం లేనట్లు అలా బుద్ధిమంతుడిలా కూర్చుండిపోవడం-ఏదో విశేషం తప్పక ఉండే ఉంటుందనుకొన్నా డతను.

ఆ మర్నాడూ వాణీ జాడ లేదు.

రహస్యాలు పోగు చేసే రమణ ఓ రహస్యవార్త మోసుకొచ్చాడు.

రాంబాబు, వాణీ పోట్లాడు కొన్నారట. 'నువ్వెంతంటే నువ్వెంత' అనుకొని ఎవర్దారిన వాళ్ళు, వాళ్ళ-వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి పోయారట.

"ఓస్! ఇంతేనా? నాల్రోజులు పోతే మళ్ళీ వాళ్ళే ఏకమవుతారు" అన్నాడు వామనరావ్ తేలికగా.

భార్యాభర్తలన్న తరువాత అలాంటి కీచులాటలు, సర్దుబాట్లు తప్పవు మరి! తనకూ వివాహ మయిన కొత్తలో ఇలాంటి అను భవాలు లేకపోలేదు.

"మిష్టర్ నరసింహారావ్! నేను చెప్పిన పని చెయ్యండి. అంతే! వాదనలు అనవసరం." మేనేజరు గదిలో నుంచి మేనేజరు గొంతు గట్టిగా వినిపించింది.

ఆఫీసంతా క్షణంలో నిశ్శబ్ద మయిపోయింది.

అందరి ముఖాల్లోనూ ఆశ్చర్యం!

హెడ్ క్లర్క్ నరసింహారావ్, మేనేజరూ—ఇద్దరూ ఒకరంటే ఒకరు గౌరవంగా ఉండేవాళ్ళు. హెడ్ క్లర్క్ చెప్పింది మేనేజర్‌కీ మేనేజర్ చెప్పింది హెడ్ క్లర్క్‌కీ వేదవాక్యం. ఇద్దరూ కలసి లాలూచీ పడి లంచాలు తింటూండటమే అందుక్కారణం.

"నేను చెయ్యను! ఏం చేస్తారో చేసుకోండి! నా యిష్ట మొచ్చిన రిమార్క్ రాసే అధి కారం నాకుంది...." అన్నాడు హెడ్ క్లర్క్.

"అలాగా! సరే-అయితే రేపే తెలుస్తుంది నీ సంగతేమిటో...." ఉద్రేకంగా అన్నాడు మేనేజరు.

"మీలాంటి వాళ్ళను చాలా

మందిని చూశాను...." హేళనగా అన్నాడు హెడ్ క్లర్క్.

ఆ సాయంత్రంవరకూ ఆఫీస్‌లో ఎవరూ ఇంక పని చెయ్యలేదు. అందరూ హెడ్ క్లర్క్, మేనేజర్ల యుద్ధం గురించే మాట్లాడుకుంటూ కూర్చున్నారు. వాళ్ళిద్దరకూ అసలు పోట్లాట ఎందుకు వచ్చిందో కొంత మంది కారణాలు వివరిస్తున్నారు. కొంతమంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

"వామనరావుగారూ!" శ్రీధరం అతని టేబుల్ దగ్గరకొచ్చి నెమ్మదిగా పిలిచాడు.

"ఏమిటి?" అడిగాడు వామనరావ్.

"నాకు రెండు గదుల ఇల్లేమైనా అద్దెకు దొరుకుతుందంటారా మీ ఇళ్ళవేపు?" అడిగాడతను.

"మీ కోసమా?" నమ్మలేనట్లు అడిగాడు వామనరావ్.

"అవును!"

"అదేమిటి? మీ వాళ్ళందరితోనూ కలిసి ఉంటున్నారుగా ఆ పెద్ద ఇంట్లో...."

"నిజమే-కాని ఉమ్మడి కుటుంబము అనేసరికి ఎన్నో గొడవలు! నాకూ, మా బ్రదర్స్‌కీ మనస్పర్థలొచ్చాయి. అలాంటప్పుడు దూరంగా ఉండటం మంచిదనుకున్నాను."

"అవున్లెండి...." ఇంకేం మాట్లాడాలో తెలీక అన్నాడతను.

"చూడండి! ఏదొక ఇల్లు. ముందు అక్కడినుంచి బయట పడాలి అంతే!"

"సరే." తలూపాడు వామనరావు.

అతనికి మతిపోయినట్లుంది శ్రీధరం వ్యవహారం.

శ్రీధరం కుటుంబంతో వామనరావుకి పరిచయం ఉంది. అతని అన్నలిద్దరూ అంటే పంచప్రాణాలు శ్రీధరానికి. వాళ్ళిద్దరూ కూడా శ్రీధరాన్ని అలాగే చూసుకొంటారు. ముఖ్యంగా వాళ్ళ పెద్ద అన్నయ్యకు తెలీకుండా శ్రీధరం ఒక్క పని కూడా చేయడు. అలాంటి వాళ్ళ మధ్య ఇంతలోనే వేరయిపోయేటన్ని విభేదాలా?

ఆఫీసునుంచి ఇంటికి బయల్దేరాడతను.

మార్కెట్ లో కొచ్చేసరికి శ్రీపతి కనిపించాడు.

"ఎక్కడా కనిపించటం లేదేంరా?" అడిగాడు వామనరావు.

"ఈమధ్య తిరుపతి, మద్రాసు అన్నీ తిరిగివచ్చాన్లే వారం రోజుల పాటు...."

"అలాగా! మరి రమణగాడి

నడిగితే నీ గురించి వాడికి తెలీదంటాడేం?" అడిగాను ఆశ్చర్యంగా.

"అవును! వాడికీ నాకూ మాటల్లేవిప్పుడు.... మొన్నోరోజు తాగి కొట్టుకొన్నాం...."

ఇది వామనరావుకి మరింత విడ్డూరంగా కనిపించింది.

"ఎందుకని?"

"అదంతా ఎందుకులేరా ఇప్పుడు. వాడి గురించి మాట్లాడడం కూడా నాకు అసహ్యంగానే ఉంటుంది...." చిరాగ్గా అన్నాడు శ్రీపతి.

వామనరావుకింకేం మాట్లాడాలో తెలీలేదు. ఏమిటిది? నిన్నున్న సఖ్యత నేడేమైపోయింది? నిన్నున్న స్నేహం ఇవాళ విరోధంగా ఎందుకు మారుతోంది? నిన్నున్న ప్రేమ ఇవాళ ద్వేషం అయిపోతుందెందుకని?

ఆ రాత్రంతా నిద్రలేకుండా ఈ ప్రశ్నలకు సమాధానం కోసమే ఆలోచిస్తూ గడిపాడు వామనరావు.

వారం రోజులు గడిచిపోయినాయి.

ఈ వారం రోజుల్లోనూ మరిన్ని ప్రశ్నలెదురయినాయతనికి.

వాణీ, రాంబాబు విడిపోయారు. ఆఫీసులో ఒకరినొకరు రోడ్డుమీద తిరిగే జూలాయి వాళ్ళకన్నా అన్యాయంగా తిట్టుకొన్నారు. ఈ గొడవ భరించలేక ఇద్దరినీ చెరో ఊరికీ ట్రాన్స్‌ఫర్ చేశారు. అంతవరకూ తనకు ప్రాణ స్నేహితుడిగా ఉన్న శ్రీనాధ్ ఓ చిన్న విషయంలో మాట పట్టింపువచ్చి తనకు దూరమైపోయాడు. కనిపించినా కనబడనట్లు తప్పించుకొంటున్నాడు. వామనరావ్కదే అర్థం కాని విషయం?

అనుక్షణం అదే ఆలోచన! మనుషుల మధ్య ఇన్ని బంధాలు, అనుబంధాలుఏర్పడినా, ఒకరినొకరు ఎంతోకాలం అభిమానించుకోలేరెందుకని? ప్రతివారూ తమవారికి ఏదొక విషయంలో దూరమెందుకవుతున్నారు? ఒకరినొకరు ఎందుకు అర్థం చేసుకోరు?

బయట గట్టిగా కేకలు వినిపించాయి.

పిల్లలు దెబ్బలాడుకొంటున్నారు. వాళ్ళను కోప్పడడానికి బయటికొచ్చాడు వామనరావు.

తన చిన్న కొడుకు ఎదురింట్లో ఈ మధ్యే దిగిన వాళ్ళబ్బాయితో స్నేహంచేసి, ఎప్పటినుంచో కలిసిమెలసి ఉన్న పక్కింటి కుర్రాడిని కొట్టి, వాడిజత పచ్చి కొట్టేసి బయటకు గెంటుతున్నాడు.

"ఎందుకురా, వాడిని కొడుతున్నావు?" మందలించ బోయాడు.

"వాడొద్దు నాన్నా-మేమిద్దరమే ఆడుకొంటాం!" మారాంగా అన్నాడు వాడు.

వామనరావుకి యిన్ని రోజులుగా అర్థంకాని విషయం హఠాత్తుగా అర్థమయింది.

మనిషి మరో మనిషిని ద్వేషించడానికి కారణం ఏమీ ఉండనవసరం లేదు.

పిల్లల పోట్లాటలు ఎంత అర్థరహితమో, పెద్దలవీ అంతే!

అయితే పిల్లలు మళ్ళీ ఏకమవుతారు. పెద్దలు కాలేరు.

అదే తేడా!


## శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడీ గుడివద్ద, ఫోన్ : 551, తెనాలి (ఎ.పి.)

బ్రాంచి : 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17

**దీర్ఘవ్యాధులకు వుత్తమ సిద్ధ వైద్యము**



హస్త ప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక్క డోస్‌తో ఎన్నడూ, కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తిచెందు స్త్రీ, పురుషులు వాడదగినది-స్వస్థులు.) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు వుచిత వైద్యం - రండి.

బ్రాంచిలు :- తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరువబడును.